క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రుద్రూర్: కోటగిరి మండలంలోని ఎత్తొండలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాన్ని తహసీల్దార్ గంగాధర్ గురువారం ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో విండో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం ఏర్పాటు



రుద్రూర్: పోతంగల్ మండలం హంగర్గాలో గురువారం రాకాసిపేట్ లయన్స్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆప్తాలిమిక్ అసిస్టెంట్ నేరెళ్ల సతీశ్, సూపర్‌వైజర్ హన్మంత్ రావు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్ సబ్‌కలెక్టర్‌కు వినతి



బోధన్‌టౌన్: బోధన్‌లోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల కరస్పాండెంట్లు, అధ్యాపకులు గురువారం సబ్ కలెక్టర్ వికాస్ మహతోను కలిసి వినతి పత్రం అందజేశారు. గడిచిన మూడేళ్ల నుంచి డిగ్రీ, పీజీ కళాశాలలకు బకా యి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రై వేట్ కళాశాలల కరస్పాండెంట్లు శ్రీధర్ రాజు, సాయిరెడ్డి, రవి పటేల్, షేక్ నజీర్, ప్రిన్సిపాళ్లు గంగాధర్, హరికృష్ణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజీనామా చేయాలి



ఆర్మూర్‌టౌన్: హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడిన ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని ఉత్తర తెలంగాణ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్ భవన్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. హిందువులపై అనుచితంగా మాట్లాడిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలన్నారు. హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పద్మ, రూప, వజ్రమ్మ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్‌లో గురువారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా మండల పశు సంవర్ధక శాఖ అధికారి లక్ష్మం ప్రభాకర్ మాట్లాడుతూ.. పాడిరైతులు ఎలాంటి అపోహలకు పోకుండా తమ పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాడి రైతులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహంతం, కమలాపూర్‌లో..



నవీపేట: మండలంలోని మహంతం, కమలాపూర్ గ్రామాల్లోని పశువులకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం గాలికుంటు నివారణ టీకాలను పంపిణీ చేశారు. రెండు గ్రామాల్లోని 674 పశువులకు టీకాలు వేశారు. ఈ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ వైద్యులు నరేందర్‌రెడ్డి పెంపకందారులకు సూచించారు. పశువులు వ్యాధులకు గురైతే వెంటనే తమను సంప్రదించాలని, మందులు అందజేస్తామని సూచించారు.

ఈనెల 21న ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్ అర్బన్: డీఈడీ, డీపీఎస్‌ఈ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం గతంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకాని అభ్యర్థులు ఈనెల 21న హాజరుకావాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో సూచించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు 23 నుంచి 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలని సూచించారు. అనంతరం ఈనెల 30 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు అలాట్‌మెంట్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తమకు కేటాయించిన కళాశాలలో చేరాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు వరం గురుకులం

- బడుగు విద్యార్థులకు సర్కారు అండ
- కార్పొరేట్ స్థాయి బోధన, వసతులు
- వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న విద్యాసంస్థలు



భోజనాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ (ఫైల్)



విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు (ఫైల్)

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసింది. ఈ పాఠశాలల్లో చదివేందుకు గ్రామాల విద్యార్థులు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలోని గురుకులాలపై ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఆర్మూర్ పట్టణంతో పాటు మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బాలబాలికల హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు పర్యవేక్షణ చేపడుతున్నారు. శానిటేషన్, నీటి సమస్య, పాఠశాలల ఆవరణలో రోడ్ల మరమ్మతులను మున్సిపల్ సిబ్బందితో కలిసి సమస్యలను పరిష్కరిస్తున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించడం, పాఠశాల ఆవరణ చుట్టూ బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ చర్యలు చేపడుతున్నారు. అలాగే విద్యార్థులకు 'స్వచ్ఛత హి సేవా'లో భాగంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తూ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కళాశాల ఆవరణలో ఏర్పడ్డ గుంతలను మొరంతో చదును చేయించారు. అలాగే అన్ని గురుకుల పాఠశాలల్లో ప్రిన్సిపాళ్లతో ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపు ద్వారా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్నారు.

సమస్యలు ఉంటే దృష్టికి తేవాలి



గురుకుల, వసతి గృహాల్లో శానిటేషన్, వాటర్ సమస్య, ఏదైనా సమస్య ఉంటే నా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాను. విద్యార్థులకు దోమల నివారణకు ఫాగింగ్, పాఠశాలల చుట్టూ ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ వేయిస్తున్నాం.

– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

జోనల్ స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్‌లో గురువారం కమ్మర్‌పల్లి జోనల్ సెలక్షన్ కోసం కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల మండలాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ అండర్–14, అండర్–17 బాలుర, బాలికల విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. పోటీలకు ఎంఈవో ఆంధ్రయ్య, హెచ్‌ఎం కనక గంగాధర్, పీఈటీ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆనకట్టపై పిచ్చి మొక్కల తొలగింపు



ఆనకట్టపై పిచ్చి మొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

బాల్కొండ: ఎస్సారెస్పీ ఆనకట్టపై ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను ప్రాజెక్ట్ సిబ్బంది తొలగిస్తున్నారు. గతేడాది వీఆర్‌ఏల సర్దుబాటులో భాగంగా ప్రాజెక్ట్‌కు 13 మంది ఎంఎంలు(మ్యాన్ మజ్దూర్)లను ప్రభుత్వం కేటాయించింది. దీంతో ఆనకట్టపై ఎలాంటి పిచ్చి మొక్కలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఆనకట్ట అందంగా కనిపిస్తోంది. ఆనకట్టపై పిచ్చి మొక్కలను తొలిగించడంపై పర్యాటకులు, ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సబ్‌స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసిన అధికారులు

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఉన్న సబ్‌స్టేషన్‌లో నూతన 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఏర్పాటు చేశారు. లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ రవీందర్ అన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో డీఈ ఎంఆర్‌టీ రాజేశ్వర్, డీఈ ఆపరేషన్ హరిచంద్‌నాయక్, ఏడీఈలు రాజేశ్వర్, శ్రీనివాస్‌లు, జేఈ మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ డీఈకి సన్మానం



డీఈని సన్మానిస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని డివిజన్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న విద్యుత్ శాఖ డీఈ హరిచంద్‌నాయక్‌ను 327, 1104 యూనియన్ నాయకులు గురువారం సన్మానించారు. హరిచంద్‌నాయక్ నిర్మల్ జిల్లాలోని ఎంఆర్‌టీ విభాగానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో 327, 1104 యూనియన్ నాయకులు సల్లశ్రీనివాస్, చందర్‌నాయక్, సంజీవ్, నరేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా వేణుగోపాల్ యాదవ్‌ను నియమించాలి

బాల్కొండ: కాంగ్రెస్ పార్టీ కోసం 20ఏళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తున్న పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్‌ను డీసీసీ అధ్యక్షుడిగా నియమించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ద్యాగ శేఖర్ డిమాండ్ చేశారు. ముప్కాల్ మండల కేంద్రంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. విద్యార్థి నాయకుడిగా, సెన్సార్ బోర్డు సభ్యుడిగా, పార్టీ కోసం నిరంతరం పోరాటాలు చేసిన నాయకుడిని గుర్తించి డీసీసీ అధ్యక్షుడిగా నియమించాలని కోరారు. సమావేశంలో విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



బాల్కొండ: మండల మాజీ ఉప సర్పంచ్, బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ వాహబ్ గురువారం తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి పనులను ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వాహబ్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మజార్, సల్ల నర్సయ్య, పిప్పెర అశోక్, తోట గంగాధర్, ఎర్రన్న, నరేశ్, ఆరిఫ్, ఉమెర్ ఉన్నారు.

ఆధ్యాత్మికం..

- విఠలేశ్వరాలయంలో కాకడ హారతి ప్రారంభం



రుద్రూర్: మండల కేంద్రంలోని శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయంలో గురువారం తెల్లవారు జామున ఆలయ అర్చకులు రాము కులకర్ణి ఆధ్వర్యంలో కాకడ హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కాకడ హారతి నెల రోజుల పాటు కొనసాగుతుందని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చిదుర వీరేశం, గెంటిల సాయిలు తెలిపారు. పండరీపూర్ సంప్రదాయాన్ని పురస్కరించుకుని ప్రతి రోజు తెల్లవారు జామున ప్రత్యేక పూజలు, కాకడ హారతి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి రోజు ఆలయానికి భక్తులు తరలిరావాలని వారు కోరారు.

- పోచమ్మతల్లికి ప్రత్యేక పూజలు



బాల్కొండ: మండలంలోని నాగాపూర్‌లో గ్రామస్తులు గురువారం లంబడిపోచమ్మకు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ప్రతి ఏడాది అమ్మవారికి పూజ లు నిర్వహించి నైవేద్యాలు సమర్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమాచారం..

- 22న మడిగెలకు వేలం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయ ప్రాంగణంలో ఉన్న పలు మడిగెలకు ఈనెల 22న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రవీందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ. 5వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని కోరారు.

బదిలీపై వచ్చిన పోలీసులు

రుద్రూర్: వర్ని, కోటగిరి, రుద్రూర్ పోలీస్ స్టేషన్లలో పోలీసులు బదిలీ అయ్యారు. కోటగిరి పీఎస్ నుంచి ఏఎస్సై శ్రీనివాస్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ విశంకర్, ఐదుగురు కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. కోటగిరికి ఏఎస్సై అబ్దుల్ రహీం బదిలీపై వచ్చారు. రుద్రూర్ పీఎస్ నుంచి కానిస్టేబుల్ సాయన్న బదిలీ కాగా ఏఎస్సై గంగాధర్, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుళ్లు గజేందర్, అస్సర్, గంగాధర్ బదిలీపై వచ్చారు. వర్ని పీఎస్ నుంచి ఐదుగురు బదిలీ కాగా ఒకరు బదిలీపై వచ్చారు.

మడిగెల్లోనే కూరగాయలు విక్రయించాలి

- నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి
- శ్రద్ధానంద్‌గంజ్ పరిశీలన



మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్

సుభాష్‌నగర్: నగరంలోని శ్రద్ధానంద్‌గంజ్‌లో కూరగాయల వ్యాపారులకు కేటాయించిన మడిగెల్లోనే కూరగాయలు విక్రయించాలని నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి సూచించారు. నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లోగల కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌ను గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్కెట్‌లో వ్యాపారులు మడిగెలు వదిలి రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియమాలు పూర్తిగా విస్మరిస్తున్నారని, మడిగెలు వదిలి రోడ్డుపై కూరగాయలు విక్రయించడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నట్లు తనకు ఫిర్యాదులు అందాయన్నారు. ఇకపై మడిగెల్లోనే కూరగాయలు విక్రయించాలని, రోడ్డుపై విక్రయించినట్లు తన దృష్టికి వస్తే లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. మార్కెట్‌లో వాహనాల వల్ల వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని, కూరగాయలు తీసుకొచ్చిన వాహనాలు బయటే ఉంచేలా చర్యలు తీసుకోవాలని సెక్రటరీ ఖాదర్‌ను ఆదేశించారు. మార్కెట్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఎంసీ డైరెక్టర్లు నరేందర్, మల్లేశ్, హోల్‌సేల్ అసోసియేషన్ సభ్యులు, మార్కెట్ కమిటీ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



రెంజల్‌లో నివాళులు అర్పిస్తున్న తహసీల్దార్



హంగర్గాలో..

రెంజల్/ రుద్రూర్: పవిత్ర రామాయణాన్ని రచించి ప్రపంచానికి అందించిన ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. రెంజల్ తహసీల్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు సమర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. పోతంగల్ మండలం హంగర్గా గ్రామంలో ఆది కవి వాల్మీకి జయంతి నిర్వహించారు. వాల్మీకి చిత్ర పటానికి పూలమా లలు వేసి నివాళులు నిర్వహించారు. జెండావిష్కరణ చేశారు. ప్రతి ఏడాది ఆశ్వయుజ పౌర్ణమిన వాల్మీకి జయంతి నిర్వహిస్తామని స్థానికులు తెలిపారు.

వికలాంగులకు రూ. 6 వేల పింఛన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న సురేశ్

వేల్పూర్: వికలాంగులకు రూ. 6 వేల పింఛన్ ఇవ్వాలని వికలాంగుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సురేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని రామన్నపేట్‌లో గురువారం నిర్వహించిన వికలాంగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. తక్కువ అంగవైకల్యం ఉన్నవారికి కూడా పింఛను ఇవ్వాలన్నారు. ఆగిపోయిన వికలాంగుల సబ్సిడీ పథకాలు పునరుద్ధరించాలని, మండలానికి ఒక వికలాంగుల సమాఖ్య భవనం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు రమేశ్, రజాక్, శేఖర్, భరత్, చందు, రవి, గంగాధర్, బాబూరావు, తిరుపతి, లింబన్న పాల్గొన్నారు.

పశువుల టీకాల కార్యక్రమం పరిశీలన



అమీనాపూర్‌లో టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జగన్నాథచారి

వేల్పూర్: మండలంలోని అమీనాపూర్‌లో పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి జగన్నాథచారి గురువారం పరిశీలించారు. ఇంతవరకు మండలంలో ఏయే గ్రామాల్లో పశువులకు టీకాల కార్యక్రమం పూర్తి చేసింది, ఇంకా ఎన్ని గ్రామాల్లో ఇవ్వాల్సి ఉంది అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న గాలికుంటు నివారణ టీకాలను రైతులందరూ తప్పకుండా తమ పశువులకు ఇప్పించాలన్నారు. ఆయన వెంట మండల పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి, సిబ్బంది సురేశ్, గంగాధర్, మౌలానా, జావిద్, వసంత, రైతులు ఉన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	జిగ్రా (తెలుగు)=11.30, 5.40 మానాన్న సూపర్‌హీరో(తెలుగు)- 2.50, మార్టిన్(తెలుగు)-9.00
స్క్రీన్-2 –	దేవర పార్ట్-1 (తెలుగు) - 11.15 2.50 6.25 10.00
స్క్రీన్-3 –	వేట్టయన్ (తెలుగు) - 11.50, 3.20, 6.50, 10.20
స్క్రీన్-4 –	విశ్వం (తెలుగు)- 10.00, 4.15, 10.30, జనక అయితే గనక (తెలుగు)- 1.15, 7.30,

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	విశ్వం (తెలుగు) - 10.20, 1.20, 4.20 10.30, దేవర పార్ట్-1 (తెలుగు)- 7.25
స్క్రీన్-2	కల్లుకంపౌండ్(తెలుగు)-10.40, జనక అయితే గనక(తెలుగు)-1.30, లవ్‌రెడ్డి (తెలుగు)-4.30, జిగ్రా(హిందీ)- 10.30
స్క్రీన్-3	వేట్టయన్(తెలుగు)- 10.30 4.35 7.40 10.40, ఖడ్గం(తెలుగు)-1.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	వేట్టయన్(తెలుగు)-, ది వైల్డ్ రోబోట్ (తెలుగు) - 1.40, 7.45, 10.15, దేవర పార్ట్-1(తెలుగు)- 4.10
స్క్రీన్-2	ది వైల్డ్ రోబోట్(తెలుగు)-10.30, విశ్వం (తెలుగు) - 1.00 7.15, జనక అయితే గనక (తెలుగు)-4.15 10.30
స్క్రీన్-3	ఇద్దరు (తెలుగు)-10.00, లవ్‌రెడ్డి (తెలుగు) - 1.00 7.30, వేట్టయన్ (తెలుగు) - 4.00, ఖడ్గం (తెలుగు) - 10.30
స్క్రీన్ -4	రివైన్డ్(తెలుగు)-10.25, వీక్షణం(తెలుగు) - 1.20, జిగ్రా(హిందీ) -4.00, వేట్టయన్(తెలుగు)-10.40
లలితామహల్	దేవర పార్ట్-1(తెలుగు)
దేవి	జనక అయితే గనక (తెలుగు)
నటరాజ్	విశ్వం (తెలుగు)
విజయ్	వేట్టయన్(తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,100	వెండి (కిలో)	96,000
22 క్యారెట్స్	72,980		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

సంక్షిప్తం

బీజేపీ సభ్యత్వ నమోదు పరిశీలన



మోర్తాడ్: మండలంలోని దొన్కల్‌లో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీనియర్ న్యాయవాది లోక భూపతిరెడ్డి పరిశీలించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రానుందని, ప్రజలు సభ్యత్వం తీసుకోవడంపై ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు. పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల నరేశ్, నాయకులు ముత్యంరెడ్డి, తీగెల మల్లేశ్, గంగారెడ్డి, నర్సయ్య, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సెమినార్

బోధన్‌రూరల్: పట్టణంలోని డిప్యూటీ డీఈవో కార్యాలయంలో విద్యార్థులకు మండల స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. గురువారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే అంశంపై విద్యార్థులకు సెమినార్ నిర్వహించగా విజయ్‌సాయి హైస్కూల్ కు చెందిన బుష్రా బుతూల్, సాలూర మండలంలోని హున్సా ప్రభుత్వ పాఠశాలకు చెందిన వైష్ణవి ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాస్థాయికు ఎంపికై నట్లు బోధన్, సాలూర మండలాల ఇన్‌చార్జి ఎంఈవోలు నాగయ్య, మంజూష తెలిపారు.

సీపీఎం ఏరియా కార్యదర్శిగా నన్నేసాబ్



రుద్రూర్: బాన్సువాడ నియోజకవర్గంలోని ఆరు మండలాల (రుద్రూర్, కోటగిరి, వర్ని, పోతంగల్, మోస్రా, చందూర్) సీపీఎం ఏరియా కార్యదర్శిగా నన్నేసాబ్‌ను ఎన్నుకున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఎ రమేశ్‌బాబు పేర్కొన్నారు. రుద్రూర్‌లో గురువారం నిర్వహించిన సీపీఎం ఏరియా రంఎడో మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కమిటీ సభ్యులుగా నెల్లూరి లక్ష్మణ్, కె సాయిబాబా, బొర్ర గంగాధర్, పట్నం రాములు, పుప్పాల లక్ష్మణ్, ఎర్ర సాయిబాబు ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

గోడప్రతుల ఆవిష్కరణ



రెంజల్: హైదరాబాద్‌లో ఈ నెల 20న నిర్వహించే విలీన సభ పోస్టర్లను మండలంలోని బోర్గాం గ్రామంలో గురువారం ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూను టీయూసీఐలో విలీనం చేస్తున్నట్లు ప్రగతిశీల కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పార్వతి రాజేశ్వర్ పేర్కొన్నారు. 14 రాష్ట్రాల్లో కార్మికుల పక్షాన పోరాడుతున్న టీయూసీఐలో ఐఎఫ్‌టీయూను విలీనం చేయ డం ద్వారా మరింత బలపడుతుందని అన్నారు. ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు పుట్టి నాగన్న, ఒడ్డెన్న, నసీర్, పోశెట్టి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.